



భగత్ సింగ్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పింఛను ఇక లేనట్లే..!

- జిపిఎస్ బిల్లు పట్ల వ్యతిరేకత
- ఆందోళన బాటలో ఉద్యోగ, ఉపాధ్యాయులు
- పలుచోట్ల జిపిఎస్ బిల్లు పత్రాలు దహనం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తాం' అని పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఇది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీల్లో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ కూడా నెరవేర్చినట్లు ఇటీవల ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ తీసుకొచ్చిన బిల్లుపై సర్వత్రా వ్యతిరేకత కొనసాగుతోంది. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలనుసారం ఆర్థిక సంస్కరణల అమలులో భాగంగా గతంలో 2004లో ఎన్‌డిఎ ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును తీసుకొచ్చింది. ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి సిపిఎస్ విధానాన్ని తెరమీదికి తీసుకొచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిపిఎస్ విధానం రద్దు పట్ల ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్మోహన్ రెడ్డి ఈ విధానాన్ని రద్దు చేస్తామని హామీఇచ్చారు. ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని హామీఇచ్చారు. ఈ హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించకుండా నాలుగున్నర సంవత్సరాల పాటు మంత్రుల కమిటీ పేరుతో కాలయాపన చేసింది. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును మూడేళ్లలోపు సవరణ చేసుకునేందుకు అవకాశం కల్పించి, అనంతరం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు పూనుకున్నారు.

ఉద్యోగులకు సంబంధించిన మూలవేతనంలో 10 శాతం నేరుగా తీసుకుని వాటిని షేర్ మార్కెట్లలో పెడతారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 10 శాతం మాత్రం చెల్లించదు. ప్రభుత్వం చెబుతున్నట్లు జిపిఎస్ విధానం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ కాదని ఉద్యోగ, ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు విరమణ చెందిన అనంతరం పెన్షన్ వస్తుందో లేదో కూడా గ్యారెంటీ ఇవ్వలేని ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు పూనుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ గత రెండు రోజులుగా అనేక ప్రాంతాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు జిపిఎస్ బిల్లు పత్రాలను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జిపిఎస్, సిపిఎస్‌కు తేడా ఏమీ లేదు

- కె.సురేష్ కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జిపిఎస్ బిల్లు సిపిఎస్‌కు ఎలాంటి తేడా లేదు. ఈ రెండు విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ పొందే భద్రత కల్పించే విధంగా లేవు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలో భాగంగానే రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జిపిఎస్‌ను తీసుకొచ్చింది. ఈ రెండు విధానాలను ఉపసంహరించుకొని ఒపిఎస్‌ను అమలు చేయాలి.

సిఎం హామీ ఇచ్చి మోసగించారు

- తిమ్మన్న, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసగించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన జిపిఎస్ కూడా నష్టదాయకంగానే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

పింఛను అందుతుందో.. లేదో.. గ్యారెంటీ లేదు

- జి.హృదయ రాజు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



గ్యారెంటీ పెన్షన్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ అందే గ్యారెంటీ లేదు. సిపిఎస్, జిపిఎస్ రెండింటి స్వరూపం ఒకటే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలి.

మతోన్మాదంపై పోరాటానికి..

భగత్‌సింగ్ జీవితం మార్గదర్శకం...

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ - భగత్ సింగ్ జయంతి సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మతోన్మాదంపై పోరాటానికి భగత్ సింగ్ జీవితం మార్గదర్శకమని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. గురువారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి సుందరయ్య జంక్షన్ వరకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్ సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, నగేష్, అధ్యక్షులు రాఘవేంద్ర, సాయి, ఉదయ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగేష్, అబ్దుల్లా మాట్లాడారు. భగత్ సింగ్ 1907వ సంవత్సరం బంగా గ్రామంలో జన్మించారని తెలిపారు. భగత్ సింగ్ ఆయన సహచరులు రాజ్ గురు, సుఖదేవ్‌ను 1931 మార్చి 23న బ్రిటీష్ ప్రభుత్వం లాహోర్ జైలులో ఉరితీసిందని తెలిపారు. నేడు సరిగ్గా భారతదేశంలో మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకొని మతవిద్వేషాలను పెంచి పోషిస్తూ ప్రజలు తమ అసలైన సమస్య నిరుద్యోగం, పేదరికం దుర్భర పరిస్థితిలో నుంచి మెరుగైన జీవితాన్ని పొందడానికి పోరాటం చేయకుండా మతోన్మాదులు ప్రజల మధ్య చీలికలు పెడుతున్నారని విమర్శించారు. భగత్ సింగ్ తన గురువు అయిన లాలా లజపతిరాయ్ మతాన్ని రాజకీయాలకు ఉపయోగిస్తే తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. మతం పేరుతో, ప్రాంతం పేరుతో, కులం పేరుతో ఐక్యం చేయడం అంటే ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి ప్రజల జీవితాలను మరింత దుర్భర పరిస్థితుల్లోకి నెట్టడానికి చేసే ప్రయత్నమని తెలిపారు. దేశంలోని విద్య పేద, మధ్యతరగతి వర్గాలకు అందకుండా నూతన విద్యా విధానం పేరుతో విద్యా వ్యాపారీకరణ, విద్య కార్పొరేటీకరణ, విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలని కోరారు. అలాగే భారీగా పెరిగిన నిరుద్యోగం, ధరలు, పేదరికం, తలసరి ఆదాయంలో వ్యత్యాసం, సామాజిక అసమానతలు, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువకులు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు శిరీష, నగర నాయకులు వినయ్, సిటీ కార్యదర్శి సాయి, ఉదయ్, సిటీ ఉపాధ్యక్షులు అబుబాకర్, సిటీ నాయకులు ఆర్యన్, వీరేష్, తేజ, వీరేష్ గౌడ్ పాల్గొన్నారు.

జిపిఎస్ బిల్లును ఉపసంహరించుకోవాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ బిల్లు పత్రాలు దహనం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జిపిఎస్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. జిపిఎస్‌కు, సిపిఎస్‌కు ఎలాంటి తేడా లేదన్నారు. ఈ రెండు విధానాలు కాకుండా ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జిపిఎస్ బిల్లు పత్రాలను దహనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. వైసిపి అధికారంలోకి రాగానే సిపిఎస్‌ను రద్దు చేస్తామని పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారని విమర్శించారు. జిపిఎస్‌లో కూడా సిపిఎస్‌లో ఉన్న అంశాలే ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలో భాగంగానే జిపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. జిపిఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పింఛను భద్రత అనేది లేదన్నారు. ఈ బిల్లు కూడా కార్పొరేట్ సంస్థలకే ఉపయోగపడుతుందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ఉపయోగమూ లేదని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి నుంచి సాధించుకున్న పింఛను హక్కును తీసేయడం పాలక ప్రభుత్వాలకు లేదన్నారు. అనేక రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం బిజెపి పాలిత రాష్ట్రాల కంటే ముందుగా జిపిఎస్‌ను అమలు చేసేందుకు పూనుకుందని మండిపడ్డారు. ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు మారెప్ప, సహాధ్యక్షులు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా నాయకులు ఇబ్రహీం, నవీన్ పాటి, యెహోషువా, తిమ్మన్న, ప్రసాద్, దుర్గా ప్రసాద్, మద్దులేటి, రంగన్న, హనుమన్న, హనుమంతు, వెంకటేశ్, అనిల్ కుమార్, ఎపి సిపిఎస్ఈఎ నాయకులు రాము పాల్గొన్నారు.



బిల్లు పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

శాంతి, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన - ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మానవాళి శాంతి, సౌభ్రాతృత్వం కలిగి ఉండాలని, నగరంలోని ప్రజలు ప్రేమ, ఆప్యాయతలను పంచుతూ పరమత సహనం పాటించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని లావుబాలి దర్గా నుంచి ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లోని దర్గా వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మిలాద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించారు. ఈ సభకు ఖాద్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 'భేటీ బచావో.. బేటీ పడావో' అనే నినాదాన్ని మహ్మద్ ప్రవక్త ఆనాడే తీసుకొచ్చారని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డి మాట్లాడారు. దేశంలో శాంతి, సహనం, ప్రేమ, సోదర భావం, ఆప్యాయతలను కలిగి ఉండాలని చెప్పారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త చెప్పిన మార్గాల్లో నడవాలని, అన్ని మతాల వారిని గౌరవించదగ్గ దేశం మనదని తెలిపారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక నగరంలోని ప్రజలని చెప్పారు. వినాయక నిమజ్జనం రోజు ముస్లింలు తాగునీటిని అందించి మతసామరస్యాన్ని చాటారని కొనియాడారు. ముస్లింలు సమాజ శ్రేయస్సు కోరి దర్గాల్లో, మసీదుల్లో వర్షాల కోసం ప్రార్థనలు చేశారని తెలిపారు. ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో ఎలా ఉండాలో తెలుసుకొని, నడుచుకోవాలని సూచించారు. సమాజం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తెలిపారు. పేద, ధనికుని మధ్య పోరాటం జరుగుతుందని, ప్రతి పేదవాడూ చదువుకొని ఎదగాలని చెప్పారు. దేశంలో ముస్లింలు 15 నుంచి 18 శాతం మాత్రమే ఉన్నారని, అందులో 18 శాతం మాత్రమే చదువుకుంటున్నారని తెలిపారు. 30 శాతం ఉద్యోగాలు చేస్తున్నారని, ఉన్నత స్థానంలో ఉద్యోగాలు చేసేవారు కేవలం 4 శాతం మాత్రమే ఉన్నారని చెప్పారు. కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ.విజయమనోహరి మాట్లాడుతూ... అన్నీ పండగలు అందరమూ కలిసి జరుపుకుంటున్నామని తెలిపారు. ఆడపిల్లలకు సమాన హక్కు ఇచ్చే విధంగా ప్రవక్త అడుగుజాడల్లో నడవాలని సూచించారు. మహిళలకు స్థానం కల్పించడం వల్లనే తాను ఈ స్టేజిపై నిలిచి మాట్లాడగలుగుతున్నానని తెలిపారు. సెంట్రల్ మిలాద్ కమిటీ నాయకులు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ మాట్లాడుతూ... ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బోర్డు కమిటీ సభ్యులుగా ఉన్నందువల్ల ఆయన చొరవ తీసుకొని ఈద్గా కోసం స్థలాన్ని కేటాయించే విధంగా కలెక్టర్, ఎస్పీతో కలిసి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ... వక్ఫ్ ఆస్తి కబ్జాలో ఉందని, 40 ఎకరాల్లో 4 ఎకరాలు ఇచ్చే విధంగా కృషి చేసేందుకు కలెక్టర్, ఎస్పీ సహకారం అందించాలని కోరారు. అలాగే నగరంలో పేదల కోసం రూ.కోటితో పీనరల్ హోమ్ తయారు చేస్తున్నారని తెలిపారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సమీరుద్దీన్ ముజమ్మిల్ మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త విధానాలను అనుసరిస్తూ మహిళలు, అనాథలు, పేదలందరినీ సమానంగా చూడాలని కోరారు. ఎస్పీ కృష్ణ కాంత్ మాట్లాడుతూ... భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశంలో అందరూ అందరి పండగలు చేసుకుంటూ, పరమత సహనాన్ని కలిగి ఉంటారని చెప్పారు. లావ్ బాలి దర్గా పీఠాధిపతి, సెంట్రల్ మిలాద్ కమిటీ నాయకులు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ సున్నత్ జమాత్ వారి కోసం ఈద్గా కావాలని కలెక్టర్‌ను, ఎమ్మెల్యేను కోరారు. అందుకు అందరి సహకారంతో ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. అనంతరం సెంట్రల్ మిలాద్ కమిటీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా అజ్మీర్ వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్ రెడ్డి సహకారంతో ఐదుగురిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. అలాగే ఉమ్రాకు షేక్ నూర్ అహ్మద్‌ను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. సయ్యద్ షా, అబ్దుల్లా ఖాద్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత పెద్ద



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



అశోకా కాలేజ్ అటానమస్ పొందిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కళాశాల విద్యార్థినిలు టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్

అశోకా కాలేజీకి 'అటానమస్' హోదా

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

దూపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలకు యుజిసి అందించే ప్రతిష్ఠాత్మకమైన స్వయం ప్రతిపత్తి(అటానమస్) గుర్తింపు లభించినట్లు అశోకా కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ నవీన్ తెలిపారు. గురువారం అశోకా కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ డా హరీష్ క్రిష్ణ మాట్లాడారు. అశోకా కాలేజీకి స్వయం ప్రతిపత్తి(అటానమస్) గుర్తింపు 2023-24 నుంచి 2032-2033 వరకు 10 సంవత్సరాల కాలానికి లభించిందని తెలిపారు. తమ కళాశాలకు ఈ హెూదా లభించిన సందర్భంగా అందుకు కృషి చేసిన ఫ్యాకల్టీ, సహకరించిన విద్యార్థినిలకు, తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వయం ప్రతిపత్తి గుర్తింపు ద్వారా సాంకేతిక మార్పులకు అనుగుణంగా సిలబస్, కోర్సులను మార్పు చేసుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాలేజ్ వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినిలు హాజరై భారీ కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచుతూ బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

సాహిత్య కృషి అభినందనీయం : శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : సాహిత్యాన్ని నలుమూలలా విస్తరింపచేసి సాహిత్య సేవ చేయడం మామూలు విషయం కాదని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ శమంతకమణి అన్నారు. గురువారం కర్నూలులో 6వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం జరిగింది. గణేష్ సాహితీ సంస్థ వ్యవస్థాపకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సుజాత గౌడ్ అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ప్రత్యేక ఆహ్వానితులుగా కరీంనగర్ జిల్లాకు చెందిన వసంత పాల్గొని ప్రసంగించారు. కర్నూలుకు చెందిన కవయిత్రి, రచయిత్రి డా.చంద్రమౌళిని సభను ప్రారంభించారు. కర్నూలు జిల్లాకు కవయిత్రి నాగజ్యోతి, బెన్నమ్మలు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శమంతకమణి

సాహితీ దిగ్గజం గుర్రం జాషువా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తెలుగు సాహితీ దిగ్గజం, సాంఘిక దురాచారాలను దునుమాడిన ధీశాలి గుర్రం జాషువా అని సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ కొనియాడారు. సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను గురువారం స్థానిక కెకె భవన్‌లో పిఎన్ఎం జిల్లా అధ్యక్షులు ఎం.పి బసవరాజు అధ్యక్షతన నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వం, జీవనతత్వం వేర్వేరు కాదని ఆచరించి చూపించిన గొప్ప కవి జాషువా అన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా కన్వీనర్ జెఎన్ శేషయ్య మాట్లాడుతూ జాషువా పద్యాలు, హరిచంద్ర కాటిసీనులో జనాన్ని ఉర్రూతలూగించాయని, తిరుపతి వేంకట కవుల చేత గండపెండేరం తొలగించుకొన్న కవి శ్రేష్టుడని పేర్కొన్నారు. రంగస్థల కళాకారుడు రవిశంకర్ జాషువా పద్యాలు ఆలపించారు. ఎంపి బసవరాజు జాషువాపై గీతం పాడారు. కార్యక్రమంలో కళాకారులు లోకేష్, బాలు, బతుకన్న, మద్దిలేటి, సోమేశ్వరి, లక్ష్మి, సరిత, సుబ్బు, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక కవులకు మార్గదర్శి గుర్రం జాషువా : హరికిషన్

ఆధునిక కవులకు గుర్రం జాషువా మార్గదర్శి అని డాక్టర్ ఎం.హరి కిషన్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టియు భవన్‌లో పుల్లా రామాంజనేయులు అధ్యక్షతన గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి డాక్టర్ హరికిషన్, రచయిత జంధ్యాల రఘుబాబులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి సమాజంలో నెలకొన్న అసమానతలు తొలగించాలంటే దానికి జాషువా కవిత్వం ఒక వజ్రాయుధంగా ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రధాన వక్త జెవి.కృష్ణయ్య మాట్లాడుతూ గుర్రం జాషువా కుల మత రహిత సమాజం కోసం కలలు కన్నారని చెప్పారు. కవులు రాణి లీల, పెరికల రంగస్వామి మాట్లాడారు. కవులు ప్రమోద్, మునిస్వామి, రేవుల శ్రీనివాసులు తదితరులు తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా కవులకు పుస్తకాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో విశాలాంధ్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కర్నూలు కలెక్టరేట్ : తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న, డిసిసి సహాయ కార్యదర్శి ఈ లాజరస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఆదోని ఇన్చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కాసిం వలీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అహ్మద్ నూర్, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, మహిళా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లులర్పిస్తున్న సాహితీ స్రవంతి, ప్రజానాట్యమండలి నాయకులు



నివాళ్లులర్పిస్తున్న హరికిషన్, జంధ్యాల రఘుబాబు తదితరులు

30న పశు సంవర్ధక శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఎపి నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ బి.సేవా నాయక్ ఆదేశాల మేరకు ఈ నెల 30న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో పశుసంవర్ధక శాఖ ఉద్యోగులందరికీ స్పోర్ట్స్ మీట్, అక్టోబర్ 1న ఆదివారం పాత బస్టాండ్‌లోని వెటర్నరీ పాలీ క్లినిక్ సమావేశ మందిరంలో 4వ జోన్ స్థాయి కార్యవర్గ సమావేశం, ఉమ్మడి కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎపి నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవోస్ హెూమ్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల జిల్లాలోని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్, పశుసంవర్ధక శాఖ సహాయకులు అందరు కూడా అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు, కర్నూలు, నంద్యాల జిల్లాల జాయింట్ డైరెక్టర్స్, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విసిహెచ్ వెంగల్ రెడ్డి, వి.జవహర్ లాల్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.జనార్దన్ రెడ్డి, ఎస్.రంగన్న, ఎంఎండి యూసఫ్ ,కే సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.వెంకటేశ్వర్లు

ట్రాన్స్‌ఫార్మర్‌ను, కరెంట్ తీగలను మార్చాలి : వ్యకాసం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రోడ్డుపై వున్న ట్రాన్స్ ఫార్మర్‌ను, కరెంట్ తీగలను సైడ్‌కు మార్చి ప్రజల ప్రాణాలను కాపాడలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకట రాముడు, మండల కార్యదర్శి గోపాల్, సిఐటియు మండల అధ్యక్షులు ఉసేనయ్యలు డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య నగర్ కాలనీల దగ్గర రోడ్డుపై వున్న ట్రాన్స్ ఫార్మర్‌ను, కరెంట్ తీగలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య నగర్ కాలనీల ప్రజలు రోజు పూల తోట గ్రామానికి బైకుల మీద వెళ్తుంటారని, ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ తీగలు ప్రమాదకరంగా వున్నాయని చెప్పారు. ఈ కాలనీలకు ఆర్టీసీ బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా వారు రోడ్డుపై వున్న ట్రాన్స్ ఫార్మర్‌ను, కరెంట్ తీగలను తొలగించాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. డబ్బులు చెల్లిస్తే గానీ పనులు చేయబోమని చెపుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందిగా వున్న సమస్యను పరిష్కరించమంటే డబ్బులు కట్టమని అడగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను, కరెంట్ తీగలను రోడ్డు సైడ్‌కు మార్చాలని, లేని పక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కిందకు వేలాడుతున్న తీగలను చూపుతున్న నాయకులు




రైతులకు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిస్తాం

ప్రజాశక్తి - పత్తికొండ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని త్వరలోనే రైతులు ముందుకు తీసుకొస్తామని ఎవిపి నవీన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పత్తికొండ మండలం హెూసూరు గ్రామంలో కోరమాండల్ ఆధ్వర్యంలో మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కోరమాండల్ ఏవిపి నవీన్ రెడ్డి రిటైల్, ఎండి బాబు హాజరై రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. మిరప పంటకు క్రిమి కీటకాలు, తెగులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిరప పంట మొక్క దశ నుంచి ఎరువులు, పిచికారి మందులు వ్యవసాయ అధికారులను అడిగి సలహా మేరకు వేసుకోవాలన్నారు. నాణ్యత గల పిచికారి మందులు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం ఆదినారాయణ రెడ్డి, పత్తికొండ కోరమండల్ మేనేజర్ హరి, సిబ్బంది గిడ్డయ్య, భరత్, భాష, బసవ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దృశ్యం





జాషువా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న నాయకులు

విశ్వ నరుడు జాషువా

- సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు బసప్ప

ప్రజాశక్తి - ఆదోని

'కులమతాల పంజరంలో చిక్కుకోను. నేను విశ్వనరుడిన'ని చాటి చెప్పిన గుర్రం జాషువా నిజమైన మానవతా వాది అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప తెలిపారు. గురువారం పట్టణంలోని భారతీయ సామాజిక సేవా సమితి కార్యాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి సభ నిర్వహించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుమ్మల భాస్కర్ మాట్లాడుతూ... అట్టడుగు వర్గాల నుంచి, అవమానాల నుంచి ఎదిగి సమాజానికి మేలు చేసే సాహిత్యాన్ని సృజించిన సాహిత్యకారుడు జాషువా అని కొనియాడారు. ఉపాధ్యాయులు అమల నాథన్ మాట్లాడుతూ... సమ సమాజ స్థాపనలో వర్తమాన కవులకు మార్గదర్శి జాషువా అని తెలిపారు. కళాకారుడు నల్లారెడ్డి గుర్రం జాషువా రాసిన కాట శీను పద్యాలను ఆలపించారు. విశ్రాంత తహశీల్దార్ షేక్షావలీ, సక్కిరి భాస్కర్, నెట్టెకంటయ్య, తిప్పన్న, కేసన్న, నర్సప్ప, స్వయం ప్రభ, సుబ్బన్న, మహదేవప్ప పాల్గొన్నారు.

మానవత దృక్పథంతో సేవ

- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ - వృద్ధులకు చేయూత

ప్రజాశక్తి - ఆదోని



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

అనాథలు, అభాగ్యుల ఆకలి తీర్చే దిశగా ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. గురువారం ఆదోనిలో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిత్ర ఎంటర్‌ప్రైజెస్ షాపు వద్ద వృద్ధులకు 250 కిలోల బియ్యం, 20 కిలోల కంది బేడలు, 30 నూనె ప్యాకెట్లు అందజేశామన్నారు. వివేకానంద సంస్థ సహాయకులు వీటిని స్వీకరించి తోడ్పాటు అందించారని తెలిపారు. పేదలను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు జితేంద్ర తల్లి పార్వతమ్మ జ్ఞాపకార్థం ఈ వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. లయన్ జితేంద్ర, లయన్ లలిత, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఓం ప్రకాష్, వివేకానంద సంస్థ ప్రకాష్, గోపాల్ పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్ల చర్చలు సఫలం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని ఆయిల్ మిల్స్ డిగారిగెటర్స్ అండ్ ట్రేడర్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. గత ఆరు రోజుల నుంచి సమ్మెలో ఉండడంతో మార్కెట్ యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, మార్కెట్ యార్డు కార్యదర్శి, యాజమాన్యం సిఐటియు నాయకులతో చర్చలు జరిపి కార్మికులకు 17 శాతం కూలి రేట్లు పెంచారు. సిఐటియు నాయకులు మహానంద రెడ్డి, వీరన్న, గోపాల్, తిప్పన్న, లక్ష్మన్న, కార్మికులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో మఠంలో కోలాహలం నెలకొంది. గురువారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వర్ణమయమైన బృందావనాన్ని దర్శించుకున్నారు. భక్తుల సందడి పెరిగిన సందర్భంగా దర్శనానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలూ కల్పించారు.

ఘనంగా అనంత పద్మనాభ జయంతి

- విశేష పూజలు నిర్వహించిన పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు అనంత పద్మనాభస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీమఠంలోని పూజా మందిరంలో స్వర్ణ పీఠంపై అనంత పద్మనాభుని ప్రతిమను ఉంచి పుష్పాభిషేకం, దీప నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములు, జయరాములు, దిగ్విజయరాముల మూర్తులను స్వర్ణ పీఠంపై ఉంచి క్షీరాభిషేకం, పుష్పార్చన చేసి మంగళ హారతులు ఇచ్చారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో...

విద్యా వ్యవస్థను రక్షించుకుందాం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యా వ్యవస్థను రక్షించుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భగత్ సింగ్ జీవితం నేటి యువతరానికి, విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు విద్యారంగంలో జరుగుతున్న పరిస్థితుల గురించి పోరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గణేష్, దినేష్, శశి, పవన్, రాజు, భరత్ కుమార్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సుందరయ్య భవన్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు అజిత్, శేషప్ప, ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాగమణి, రాఘవేంద్ర, రవి, రాజు, అబ్దుల్, రాముడు, బాబు, నిరుద్యోగులు పాల్గొన్నారు. **కౌతాళం**లోని సిపిఎం కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.



ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు



హోళగుందలో మాట్లాడుతున్న నాయకులు

ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన స్టార్ కేర్ హాస్పిటల్ ఛైర్మన్ నరసింహుడు సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్య, అక్షయ బ్లడ్ బ్యాంక్ డాక్టర్స్ గంగాధర్, ప్రతాప్, సురేష్, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి, రేవన్, చందు పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలోని ఇంగలదహాల్ గ్రామంలో భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ కారుడు భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఢిల్లీ వీధిలో ఎర్రకాగితాలు చల్లి భగత్ సింగ్ ప్రజలను చైతన్య పరిచారని తెలిపారు. ఆయన చివరికి ఉరి తీసే సమయంలో కూడా ఉరికంభాన్ని నవ్వుతూ ముద్దాడిన వ్యక్తి అని కొనియాడారు. విద్యార్థులు పంపాపతి, జాన్, మునీర్, శివకుమార్, ముసాయబ్ పాల్గొన్నారు. **దేవనకొండ**లోని సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస నాయకులు యూసుఫ్ బాష, రమేష్, డివైఎఫ్ఐ నాయకులు వీరేంద్ర, కాంతయ్య, రాజు, చిన్న రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు

- ఎఎన్ఎం విజయలక్ష్మి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా వైద్య శాఖాధికారుల ఆదేశాల మేరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిక్షలు చేస్తున్నామని ఇస్వి గ్రామ సచివాలయం ఎఎన్ఎం విజయలక్ష్మి తెలిపారు. గురువారం గ్రామంలో ఉన్న వారికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు చేశారు. ఆరోగ్యం సరిగా లేని వారిని గుర్తించి ఈనెల 30న చేపట్టబోయే ప్రత్యేక శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఎఎన్ఎం విజయలక్ష్మి

సర్వమానవాళి శ్రేయస్సే లక్ష్యం

- ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సర్వమానవాళి శ్రేయస్సు, శాంతిని నెలకొల్పడమే తమ అంతిమ లక్ష్యమని ముస్లిం మత పెద్దలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబీ సందర్భంగా మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం, మండిగిరి, బలాదూరు, ఇస్వి, సంతేకుడ్లూరు, ఆరెకల్, జాలమంచి తదితర గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. వేల సంఖ్యల్లో ముస్లిం, మైనారిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ... విశ్వ ప్రవక్త మహ్మద్ కేవలం ముస్లింల కోసం కాదని, సర్వ కోటి జీవరాశులకు ఈ విశ్వానికి ప్రవక్తగా అల్లాహ్ నియమించారని అందులో తెలిపారని పేర్కొన్నారు. బర్కత్ వలీ, ఫొటో వలీ, కాసింసాబ్, ఫక్రుద్దీన్, శుక్రు అల్లా, మహ్మద్, కుద్దుష్, బాష, ఆదం పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో మిలాదున్ నబి పండగ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన మత గురువులు షర్ఫీచమన్ సాహెబ్ కుటుంబ సభ్యులు సయ్యద్ హసన్ ఖాద్రీ షర్ఫీ, సయ్యద్ సైపుద్దీన్ ఖాద్రీ షర్ఫీ, సయ్యద్ ఖాసీం ఖాద్రీ షర్ఫీ, సయ్యద్ మైనుద్దీన్ ఖాద్రీ షర్ఫీ చమన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, వీరశైవ లింగాయత్ చైర్మన్ వై.రుద్ర గౌడ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జమియా మసీదు, చున్నం బట్టి మసీదు నుంచి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కోర్టు రోడ్, గాంధీ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్‌కు వచ్చి తిరిగి వెళ్లారు. ముస్లింలకు హిందు, ముస్లిం, క్రైస్తవులు చల్లటి పానీయాలు పెట్టి మత సామరస్యానికి మారుపేరుగా నిలిచారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ సిఐ మధుసూదన్ రావు, పట్టణ ఎస్ఐలు మస్తాన్ వలీ, రమేష్, రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మద్దిలేటి, కానిస్టేబుల్ ఫరూక్, కౌన్సిలర్ దయాసాగర్, మాజీ కౌన్సిలర్ మధు బాబు, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ సెక్రటరీ ఆల్ఫ్రెడ్ రాజా, రాష్ట్ర ఎంటి అండ్ ఆపరేషన్ కమిటీ సెక్రటరి వసుంధర దేవి, ప్రకాష్ జైన్, శివ, లాల్ కోట్ ఖదీర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు. **కౌతాళం**లో మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా నుంచి గ్రామంలోని పురవీధుల్లో జులూస్ (ప్రదర్శన) చేపట్టారు. దర్గా ధర్మకర్త మున్నా పాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నదిచాగీ, కామవరం, హాల్వి, కుంటనహళ్, బదినేహళ్, ఎరిగేరి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. **చిప్పగిరి**లో ముస్లింలు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బాబా ఫక్రుద్దీన్ మండపం వద్ద మిలాద్ చదివి అన్నదానం చేశారు. అనంతరం అక్కడి నుంచి సయ్యద్ షా బాగ్దాద్ రహమతుల్లా అబ్దుల్ సత్తార్ హది ఖాద్రీ దర్గా వరకు ప్రదర్శన నిర్వహించారు. మత పెద్ద ముల్లా పెద్ద సత్తార్ వలీ, కో ఆప్షన్ సభ్యులు కొలిమి సర్వార్ ఖాన్, కమిటీ సభ్యులు గడ్డం చాంద్ బాష, దాదా ఖలందర్, ముస్తఫా పాల్గొన్నారు. **ఆదోని** మండలంలోని ఆయా గ్రామాల్లోనూ ముస్లింలు మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి పట్టణంలోని ప్రతి మసీదులోనూ ప్రత్యేకంగా ప్రార్థన నిర్వహించారు. సర్వ మానవాళి కోసం, ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో దాతలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి వేలాది మందికి అన్నదానం చేశారు. మరికొంతమంది పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో నిర్మల్ టాకీస్ సమీపంలో హటేలి లైన్‌లో వందలాదిమంది తరలివచ్చి ప్రత్యేకంగా ప్రార్థన చేస్తూ దర్శించుకున్నారు. పట్టణంలోని కాజీపుర, అవన్నపేట, ఖుని మొహల్లా, సయ్యద్ పేట్, పరిస మొహల్లా, కౌడల్‌పేట్, ఇతర ప్రాంతాల్లో జూలూసు కార్యక్రమాలు పెద్ద ఎత్తున జెండాలతో నిర్వహించారు. సయ్యద్ మహబూబ్ బాషా పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దతుం బలం గ్రామంలో వేడుకలు నిర్వహించారు. భారీ ఎత్తున జెండాలను పట్టుకుని నినాదాలు చేస్తూ ఊరేగింపు కొనసాగించారు. **కోసిగి**లో ముస్లిం యువకులు, చిన్నారులు మక్కా మదీనా ప్రతిమలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామంలో పెద్ద జెండాతో గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ, యువకులు ప్రదర్శన చేశారు. మసీదుల్లో అన్నదానం చేపట్టారు. గ్రామ సమీపాన ఉన్న గోకర్ సాబ్ జెండా వద్ద జెండాను ప్రతిష్టించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **ఆలూరు**లో మిలాద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించారు. గ్రామంలో పెద్ద జెండాతో పురవీధుల గుండా ప్రదర్శన చేపట్టారు. **హోళగుంద** మండలంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఆలూరులో ప్రదర్శన చేపడుతున్న ముస్లింలు



ఆదోనిలో ప్రదర్శన చేపడుతున్న ముస్లింలు



కోసిగి గ్రామ పురవీధుల గుండా జెండాలతో వస్తున్న ముస్లింలు



కౌతాళం మండలంలో జెండాలతో వస్తున్న ముస్లింలు



చిప్పగిరిలో

జిపిఎస్‌పై అసెంబ్లీ సాక్షిగా...


ఆర్థిక మంత్రి అబద్ధాలు : ఎస్‌టియు

ప్రజాశక్తి - నందవరం

రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను మోసం చేస్తూ ఆర్థిక శాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పారని, ప్రభుత్వ అప్పులకు పాత పెన్షన్ విధానానికి సంబంధమేమిటని ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి ప్రశ్నించారు. గురువారం ఎస్‌టియు ఎమ్మిగనూరు ప్రాంతీయ కార్యాలయంలో సిపిఎస్, జిపిఎస్ రద్దు అవగాహన సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అధ్యక్షతన నిర్వహించారు. ప్రాంతీయ సమన్వయకర్త బి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మోజేష్, షాజహాన్, జేరు బండి శీను, అడివన్న, బాబయ్య, కోటప్ప, ముకుందా చారి, నీలకంఠ, రామచంద్ర, వీరేష్, తిమ్మరాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

మత రాజకీయాలు చేస్తే పతనం తప్పదు : నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని



ప్రజల సమస్యలు, అవసరాలు తీర్చే మాటలు మాట్లాడకుండా కేవలం మత రాజకీయాలు చేసి ప్రతి చోటా బిజెపిని గెలిపించే పని చేస్తూ పోతే, ఏదో ఒకరోజు ముస్లింలే ఎంఐఎంకు సమాధి కడతారని ఆదోని జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎ.నూర్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం ఆయన ఆదోనిలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై స్పందించని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసి ఇక్కడి రాజకీయ పార్టీలకు సర్టిఫికెట్లు ఇవ్వడం, ఇక్కడి ప్రజలు ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మకూడదని సలహాలివ్వడం హాస్యాస్పదమని తెలిపారు. ఆంధ్ర ద్రోహి బిజెపిని ఆంధ్రప్రదేశ్‌లో బలమైన పార్టీగా తయారు చేసేందుకు తహతహలాడుతున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఉద్దండ పిండాలను సైతం జైలుకు పంపిన బిజెపి ఒవైసి సోదరులను మాత్రం కంటికి రెప్పలా కాపాడుకోవడం ఇందుకు సాక్ష్యమన్నారు. రాష్ట్రంపై అంత ప్రేమ ఉంటే మోడీతో మాట్లాడి ప్రత్యేక హోదా, కరువు ప్రాంతం రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్య, వైద్యాభివృద్ధి, ఉద్యోగాలు తెచ్చి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ముస్లిం ఓట్లను చీల్చడం, బాధ్యతారాహిత్యమైన ప్రసంగాలతో హిందూ ఓటర్లను బిజెపి వైపు మళ్లించడం ఎంఐఎం రహస్య ఎజెండాలా కనిపిస్తోందన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న వైసిపి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి మంత్రాలయం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం రాఘవేంద్ర సర్కిల్‌లో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి సాక్ష్యాధారాలను కోర్టులో చూపకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ నారా లోకేష్‌ను, బ్రాహ్మణిని, భువనేశ్వరిని అరెస్టు చేసేందుకు కుట్ర జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనను ప్రశ్నించే వారిని కూడా పోలీసుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. టిడిపిపై జరుగుతున్న దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని చెప్పారు. ప్రజలు ఓటర్ల జాబితాను కూడా చూసుకోవాలని, లేకపోతే టిడిపి సానుభూతి పరుల ఓట్లను తొలగించి దొంగ ఓట్లు వేసేందుకు కూడా వెనుకాడరని తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కౌతాళం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ అడివప్ప గౌడ్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. టిడిపి నాయకులు చెన్నబసప్ప, ధని, తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయనస్వామి, అశోక్ రెడ్డి, విజయరామిరెడ్డి, మారెప్ప, నాగేష్, ఏబు పాల్గొన్నారు.

ఆదోని : చంద్రబాబు కోసం తుది శ్వాస ఉన్నంత వరకు పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అంతకుముందు గాడిదలకు వినతిపత్రం ఇస్తూ ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ మనసు మార్చుకోవాలని పేర్కొన్నారు. పద్మశాలి సోదరులు కోట రామాంజి, జక్కా వీరేష్, నాగరాజ్, మంజు, చిలక రవి, శివశంకర్, కోట గోవిందు, సత్యనారాయణ, హరీష్ దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎలాంటి ఆధారాలూ లేకుండా అరెస్టు చేసి 20 రోజులుగా రాజమండ్రి జైలులో నిర్బంధించడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని తెలిపారు. నాయకులు రామస్వామి, సాకరే మారుతి రావు, అప్సర్ బాష, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, రంగన్న, శ్రీనివాస్ ఆచారి, ఆరెకల్ రామకృష్ణ, అయ్యన్న, మల్లికార్జున, సుబ్బు, జెసి.బంగారయ్య, సాదుల్లా, రామకృష్ణ, శివప్ప, జగదీష్, బాలాజీ, వీరేష్, శ్రీనివాస్ గౌడ్, జాఫర్ పాల్గొన్నారు. అలాగే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు చేపట్టిన దీక్షలు 17వ రోజుకు చేరాయి. టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్, సాంబగల్ ఫక్రుద్దీన్, సోమశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, మద్దికెర రామకృష్ణ, మైనార్టీ నాయకులు ఎమ్‌డి.హుస్సేన్, నారాయణపురం షాషావలీ, కారుమంచి, సలకలకొండ శీన, రామకృష్ణ, పక్కీరప్ప, రాముడు, మదిరె గోవింద, రమేష్, నాగరాజు, పరమేష్, తిమ్మప్ప, శేకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలూరు : రాష్ట్రంలో తప్పుడు కేసులతో సత్యాన్ని జయించలేరని, టిడిపి అధినేత చంద్రబాబుపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో 20వ రోజు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి దేవనకొండ మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ అధ్యక్షతన టిడిపి ఈడిగ సంఘం నాయకులు, కార్యకర్తలు చెవిలో పూలు పెట్టుకుని, మోకాళ్లపై నిలబడి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్న జగన్ పదేళ్లుగా బెయిల్‌పై తిరుగుతుంటే మచ్చలేని చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులతో జైలులో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ఈడిగ సంఘం నాయకులు రామదాస్ గౌడ్, మాజీ సర్పంచులు మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీలు వెంకట స్వామి గౌడ్, రాజగోపాల్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, నిట్రవట్టి నాగేశ్ గౌడ్, ఎంపిటిసి సుల్తాన్, బజారి గౌడ్, రఘు ప్రసాద్ రెడ్డి, అశోక్ యాదవ్, శేషగిరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుపై పోరాటాలు ఆగవని, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వైసిపి అరాచక పాలనను వివరిస్తామని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాధవ్‌రావు దేశాయి, మాజీ జడ్‌పిటిసి ఈరన్న గౌడ్ తెలిపారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో టిడిపి ఆధ్వర్యంలో 16వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి ప్రతిపక్షాలను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారని తెలిపారు. రఘుమూర్తి స్వామి, సుందర్ రాజు, మిఠాయి నరసింహులు, కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్, నేసే మల్లికార్జున, కలీముల్లా, మునీర్, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, మధుబాబు, కటారి రాజేంద్ర, దామ నరసింహులు, బందనవాజ్, శాబీర్, పార్లపల్లి మల్లికార్జున, మహేంద్ర, బోయ రంగన్న, నజీర్, అల్తాఫ్, మురళీ రెడ్డి, కొండన్న గౌడ్, అంజి, ఎరుకల పరమేష్, బోయ జయన్న, శంకర్ గౌడ్, డీలర్ ఈరన్న, దాదా వలీ, నాగేష్ ఆచారి, శిల్పి భాస్కర్, సలీం, సలాం, గౌస్, బిజ్జె నాగరాజు, గుడికల్ దేవదాసు, ఈశ్వర్, యు.రవి, కృష్ణతేజ నాయుడు, డ్రైవర్ ఈరన్న, వెంకటేష్, కేశన్న పాల్గొన్నారు.



మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి



ఆదోనిలో రిలే దీక్షలో కూర్చున్న సూరం భాస్కర్ రెడ్డి, నాయకులు



ఆలూరులో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ



ఆదోనిలో గాడిదలకు వినతిపత్రం ఇస్తున్న మీనాక్షి నాయుడు



ఎమ్మిగనూరులో దీక్ష చేపట్టిన టిడిపి శ్రేణులు

సాగునీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం

- కరువును నివారించడానికి ఉద్యమిద్దాం - బొజ్జా దశరథ రామి రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుపై పాలకుల నిర్లక్ష్యంపై ఐక్యంగా పోరాటాలు చేయాలని రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామి రెడ్డి, అరుణ్, జాతీయ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు కోరారు. గురువారం స్థానిక కుర్ని కల్యాణ మంటపంలో విద్యావంతుల వేదిక, రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ నాగన్న ఆధ్వర్యంలో రాయలసీమ రైతు మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశాబ్దాలుగా రాయలసీమ పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉందని, గద్దెనెక్కిన ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చడం లేదని తెలిపారు. మద్రాస్ రాష్ట్రంలోనూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమలో నీళ్ల నిధులు, నియామకాలపై జరుగుతున్న ఉద్యమాలకు ప్రజలు, యువత రావాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌డిఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భాస్కర్ రెడ్డి, గణేష్, బజారప్ప, గోట్ల చంద్రశేఖర్, ఆదినారాయణ రెడ్డి, విద్యార్థి సంఘం నాయకులు కృష్ణ, రాజేష్, నరసన్న, ఖాజా, ఉదయ్, శేఖర్, రఘునాథ్ పాల్గొన్నారు.

పాములు పట్టడంలో దిట్ట..

వికలాంగుడు అంజి...

ప్రజాశక్తి- దేవనకొండ




విష పురుగు అయిన పాములను చూస్తే ఎవరికైనా భయమేస్తుంది. ఎక్కడ కాటు వేస్తాయోనని దూరంగా వెళ్తారు. విష పురుగు అయిన పాములను పట్టడంలో ఓ వికలాంగ యువకుడు ఏమాత్రం భయపడడం లేదు. పాములు పట్టడంలో శభాష్ అని గ్రామస్తులు అంటున్నారు. దేవనకొండ గ్రామానికి చెందిన మాల వీధిలోని అంజి అనే వికలాంగ యువకుడు ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం షేక్ మస్తాన్ వలీ అనే వ్యక్తి ఇంటి ఆవరణలో కట్టెలలోకి పాము దూరింది. ఆ పాము సమాచారాన్ని మాల అంజికి చేరవేశారు. కట్టెలన్నీ తీయించి ఆ నాగుపామును పట్టుకున్నారు. గురువారం మాల ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలోని బండల కింద ఉన్న నాగుపామును గమనించారు. ఆ ఇంటి యజమాని తక్షణమే అంజికి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పాము కోసం శ్రమించి సాయంత్రం 4 గంటల సమయంలో ఆ పామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ... గత ఆరు నెలల నుంచి పాములను పట్టుకుంటున్నానని, ఇప్పటివరకు 20 పాములను పట్టుకున్నానని తెలిపారు. పట్టుకున్న పాములను తిరిగి దూరంగా పొలాల్లోకి వదిలేస్తున్నట్లు చెప్పారు. ఎవరితో ఎలాంటి పారితోషకం లేకుండా ఉచితంగా పాములను పట్టుకొని తన సేవలు అందిస్తుండడంతో గ్రామస్తులతో శభాష్ అంజి అంటూ కొనియాడుతున్నారు.



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్యాపిలిలో నకిలీ రిజిస్ట్రేషన్లు

- సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలు - ఆలస్యంగా వెలుగులోకి



Presentation Endorsement:
Presented in the Office of the Joint Sub-Registrar, Peapally along w
& Thumb Impressions as required Under Section 32-A of Registra
fee of Rs. 1550/- paid between the hours of 2 and
day of AUG, 2023 04th day of AUG, 2023 04th day of AUG, 2
Kullayappa

Execution admitted by (Details of all Executants/Claimants under Sec 32A):

SNo-cd	Thumb Impression	Photo	Aadhar Photo	Address
1-DE		BOYA JYOTHI::04/ [1317-1-2023-249		BOYA JYOTHI W/O. C/O BOYA SURESH AADHAR- ********7831 RAYALACHERUVU,RAYALACHERUVU, RAYALACHERUVU,ANANTHAPURAMU
2-DR		R RAJAKULLAAYAPPA [1317-1-2023-2499]		R RAJAKULLAAYAPPA S/O. S/O R PEDDAKULLAAYAPPA AADHAR- ********1998 RAYALACHERUVU,YADIKI, RAYALACHERUVU,ANANTAPUR

Identified by Witness:

Sl No	Thumb Impression	Photo	Name & Address
1		R RAM MOHAN::04/08/ [1317-1-2023-2499]	R RAM MOHAN S/O R SREENIVASULU KESAVARAYUNIPETA POST
2		P BALAMADDAIAH::04 [1317-1-2023-2499]	P BALAMADDAIAH S/O P CHINNA SUNKAPPA PEAPULLY POST

Generated On:04/08/2023 02:25:43 PM

పంచాయతీ సెక్రటరీ సంతకం ఫోర్జరీ చేసిన పత్రం

ప్రజాశక్తి -ప్యాపిలి

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో నకిలీ రిజిస్ట్రేషన్ల ఘటన గతంలో రాష్ట్రంలో పెను సంచలనమే సృష్టించింది. అయితే నేటికీ సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో ఏమాత్రం మార్పు కనిపించడం లేదని పలువురు బాధితులు వాపోతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో పక్కా డాక్యుమెంట్ల ఆధారంగా సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాల్సిన సబ్ రిజిస్ట్రార్లు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆమోదముద్ర వేస్తున్నారు. ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ తరహా అక్రమాలు భారీగా చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో రాష్ట్రస్థాయి అధికారులు విచారణకు ఆదేశించడంతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చింది. సుమారు 23 సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించారు. 20 మందికి పైగా అధికారులపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే రికవరీకి కూడా ఆదేశించారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన విచారణ ప్రక్రియ మరికొన్ని జిల్లాల్లో పూర్తికాక



ప్యాపిలి సబ్ రిజిస్టర్ కార్యాలయం

ముందే తాజాగా అదే తరహా నకిలీ వ్యవహారం ప్యాపిలిలో తాజాగా వెలుగులోకి వచ్చింది. గత నెల ఆగస్టు 4న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెంగలాంపల్లె గ్రామానికి చెందిన రైతు సర్వే నెంబర్ 157/2ఎ-16 సెంట్ల మిగులు భూమిని అనంతపురం జిల్లా యాడికి మండలం కేసునాయిని పేట గ్రామానికి చెందిన బోయ జ్యోతి, రాజ కుళ్లాయప్ప ఇద్దరు కలిసి రిజిస్టర్ చేయించుకున్నారు. తర్వాత వారు డోన్‌కు చెందిన ప్రభాకర్ రెడ్డి సుబ్రహ్మణ్యంకు రిజిస్టర్ చేసారు. వెంగలాంపల్లె పంచాయతీ సెక్రటరీ మంజుల తన సంతకం ఫోర్జరీ చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటువంటివి జరగడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుం దన్నారు. కావున ఇటువంటి పునరావృత్తం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలి

- కరువు అంచనా చర్యలు చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - పాములపాడు

వర్షాభావ పరిస్థితుల వలన తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం కరువు చర్యలు చేపట్టి నష్టపరిహారాన్ని అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలన్నారు. గురువారం పాములపాడు మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన పంటలు ఎండిపోవడంతో రైతులు కొంతమంది దున్నేసారని, ఉన్న పంటలు చేతికి రాలేదని తెలిపారు. జూన్‌లో కురిసిన వర్షాలు, ఆ తర్వాత మధ్యలో నెల 10 రోజుల వరకు వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పూర్తిగా రైతాంగానికి నష్టాన్ని చేకూర్చాయని అన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని కరువును అంచనా వేయాలని డిమాండ్ చేశారు.

ఎకరాకు దాదాపుగా రైతు మొక్కజొన్న పంటకు రూ. 30 వేలు పెట్టుబడి పెట్టాడని, కౌలుకు తీసుకున్న రైతులయితే రూ. 50 వేల దాకా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని, రబీ సీజన్‌కు ఎరువులు, విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, బాలయేసు, రైతులు పాల్గొన్నారు.

ప్రవక్త సందేశం ప్రపంచ శాంతికి మార్గం

- ఘనంగా ఈద్-మిలాద్-ఉన్-నబీ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహమ్మద్ ప్రవక్త సందేశం ప్రపంచ శాంతికి మార్గం అని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. గురువారం మహమ్మద్ ప్రవక్త జయంతి సంద ర్భంగా నంద్యాల పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించి ఈద్-మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద ఖాద్రీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని ప్రజలకు వివరించారు. మహమ్మద్ ప్రవక్త కేవలం ముస్లింల కోసమే కాదని ఈ విశ్వానికి ప్రవక్తగా వచ్చారని తెలిపారు. శాంతి సందేశం, పరమత సహ నం మానవత్వం, సమాజంలో అసమానతలను తొలగించడాని వచ్చార న్నారు. మతాలకు, కులాలకు అతీతంగా ప్రశాంతంగా శాంతి యుతంగా పట్టణంలో ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రజలు సుఖ శాంతులతో ప్రశాంతంగా జీవించాలని ఖాద్రీ ఆకాంక్షించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకమన్నారు. ఈ వేడుకల్లో ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలో మిలాద్-ఉన్-నబి వేడుకలు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత గురువు సయ్యద్ అబ్దుల్ సాహెబ్ (జెండా వాలే సాహేబ్) ఆధ్వర్యంలో పట్టణంలో జెండే వాలే సాహెబ్ దర్గా నుంచి పాచ్ కమాన్ మసిద్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సయ్యద్ అబ్దుల్ సాహెబ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సందేశం ప్రపంచ శాంతికి మార్గం అన్నారు.

మీలాద్ నబీ వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని : పట్టణంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని ముస్లిం మత గురువు సయ్యద్ ఆబ్దుల్ సాహెబ్ ని పూలమాలతో సత్కరించి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఇస్లాం మత చివరి దైవదూత అయిన మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, కలాం, ఖానిక్, వార్డ్ మెంబర్ సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ : పట్టణంలో మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త దారిలో నడిచే సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురాను ద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి మైనార్టీ సెల్ నియోజక వర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు టిప్ టాప్ కలం, అల్తాఫ్ హుస్సేన్, టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





మిలాద్ నబి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

జాషువా ప్రతి అక్షరం సామాజిక చైతన్యం కోసం

ప్రజాశక్తి - నంద్యాల

సామాజిక చైతన్యం కోసం అక్షరాస్త్రాలు సంధించిన అభ్యుదయ కవి గుర్రం జాషువా అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పే ర్కొన్నారు. పద్మభూషణ్, నవయుగ కవి చక్రవర్తి, గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా గురువారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నంద్యాల ఎన్జీవోస్ హోంలో 'మానవతావాది జాషువా' అనే అంశంపై సదస్సు నిర్వ హించారు. పట్టణంలోని పలు సాహితీ సంస్థల ప్రతినిధులు, సాహిత్యాభిమానులు ఉపాధ్యాయులు జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిం చారు. ఈ చర్చా కార్యక్రమంలో ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మణి శేఖర్‌రెడ్డి, హుస్సేన్ రెడ్డి సామాజికవేత్త లింగస్వామి ఎంఈఓ రామ సుబ్బ య్య, సాహితీ స్రవంతి కార్యదర్శి మాదాల శ్రీనివాసులు, తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, రామసుబ్బయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గబ్బిలం కావ్య ంతో కావ్య ప్రపంచంలో గర్జన చేసిన గుర్రం జాషువాను అందరూ స్మరిం చుకోవాల్సిన అవసరముందన్నారు. తెలుగు సాహితీ క్షేత్రంలో నంద్యాల కీర్తిని ఇనుమడింపజేస్తున్న కవి కొప్పుల ప్రసాద్, రంగస్థల రంగంలో మేటి గా నిలిచిన గాయకుడు నరసింహులును సాహితీ స్రవంతి కార్యవర్గం ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. జాషువా పద్య పఠన పోటీలో విజేతలుగా నిలిచిన బాలా అకాడమీ విద్యార్థులు సుహేల్, హర్షితలకు బ హుమతి ప్రధానం చేశారు. సామాజికవేత్త లింగస్వామి మాట్లాడుతూ జాషువా కవిత్వము వర్ణ, వర్గ వివక్షతను చీల్చి చెండాడి సమ సమాజ నిర్మాణానికి దోహదపడిందన్నారు. డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాషువా కవిత్వంలో ప్రతి అక్షరము మానవతావాదాన్ని ప్రతిబింబిస్తుం దన్నారు. నిలువెత్తు సామాజిక స్పృహకు నిదర్శనంగా నిలిచిన జాషువా జీవితంపై కవులు గ్రంధే నరేంద్ర, నీలకంఠమాచారి, మాబుబాషా ప్రసాద్, రఫీ తమ కవితా గళాలతో ఘన నివాళులర్పించారు.



నంద్యాల : జాషువా చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న అరసం నేతలు

కుల రహిత సమాజం జాషువా కల : అరసం

స్థానిక సాయిబాబా నగర్ భగత్ సింగ్ జనచైతన్య విజ్ఞాన గ్రంథాల యంలో (అభ్యుదయ రచయితల సంఘం) అరసం నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అరసం జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్ ముర్తుజా మాట్లాడుతూ కుల ప్రసక్తే లేని సమాజం జాషువా కల అని అన్నారు. గబ్బిలం వంటి మధురమైన కావ్యాలను 36 కు పైగా రచించారని, మరెన్నో కవితా ఖండికలు రాశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరసం గౌరవాధ్యక్షులు కళామురళి, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి, సీనియర్ పాత్రికేయుడు మాదాల శ్రీనివా సులు, రంగస్థల నటుడు, కవి గిద్దలూరు వాస్తవ్యులు షేక్ దస్తగిరి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి వేదికనలంకరించి జాషువా సాహిత్య సేవలను కొనియాడారు. అరసం ఉపాధ్యక్షులు నీలకంఠమాచారి, ఉప కార్యదర్శి మహమ్మద్ రఫీ, ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయినులు సుకుమా ంబ, బాల సుబ్బమ్మ, ఆత్మకూరు నుండి మిగతా 6వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఉద్యోగులను మోసం చేసిన జగన్ : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీపై మాట తప్పి ఉద్యోగులను మోసం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు భాస్కర్ రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల వ్యతిరేకతను ఏమాత్రం ఖాతరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ బిల్లును ఉభయ సభలలో చివరి రోజు ప్రవేశపెట్టి, శాసనసభలో ప్రతిపక్షం లేకుండా చర్చ జరిపి మూజువాని ఓటుతో ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నాలుగు సంవత్సరాలు కాలయాపన చేసి ఇప్పుడు జిపిఎస్ విధానాన్ని తీసుకురావడం మూడున్నర లక్షల మంది ఉద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. స్వచ్ఛంద విరమణ చేసిన వారు కనీసం 20 సంవత్సరాలు సర్వీసు ఉండాలని జిపిఎస్ విధానంలో నిబంధన పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్ పాదయాత్ర చేసే సందర్భంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ అధికారంలోకి వచ్చాక రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి రాష్ట్రంలో 3 లక్షల 60 వేలు కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ 117 ప్రభుత్వ ఉద్యోగ శాఖలలో ఉండగా కంటిచూపు చర్యగా నేడు 10 వేల మంది ఉద్యోగులను మాత్రమే రెగ్యులర్ చేయడం మోసం చేయడమే తప్ప మరొకటి కాదని విమర్శించారు.

తేనెటీగల దాడిలో మహిళ మృతి

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - ప్యాపిలి



ఫక్రున్‌బీ (ఫైల్)

తేనెటీగల దాడిలో మండలంలోని పిఆర్ పల్లి గ్రామానికి చెందిన ఫక్రున్‌బీ (63) మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. ఫక్రున్‌బీ తమ కుమారుడు మహబూబ్ బాషా, మనువల్లు షఫీ, మొహి ద్దీన్‌తో కలిసి పొలానికి వెళ్లింది. మాలపున్నం కావడంతో చెట్టు కింద మంట వెలిగించారు. వెంటనే తేనెటీగలు వారిపై దాడి చేశా యి. మహబూబ్ బాషా కుమారులతో పరిగెత్తాడు. అక్కడే వున్న ఫక్రున్‌బీపై తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే ఆమెను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. షఫీకు గాయాలయ్యాయి. బాలుడికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

భగత్ సింగ్ ఆశయాలు సాధిద్దాం

ప్రజాశక్తి - విలేకరులు

డోన్ : భగత్ సింగ్ ఆశయాలు సాధిస్తామని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ బాష, జె.అశోక్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ అతిచిన్న వయసులోనే భారత స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగం చేసిన విప్లవకారుడని, ఆయన జీవితం నేటి యువతరానికి విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యారంగంలో జరుగుతున్న పరిస్థితుల గురించి పోరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శ్రీను, పవన్ కుమార్ గౌడ్, రాజశేఖర్, రామలింగడు, గోపాల్, ఎస్ఎఫ్ఐ శ్రీనివాస్, ఆకాష్, వేణుమాధవ్, గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల : దేశ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్రాలను సాదించేందుకు భగత్ సింగ్ తన ప్రాణాలను త్యాగం చేస్తూ ఉరి కంబాన్ని ముద్దాడిన త్యాగ జీవి భగత్ సింగ్ అని భగత్ సింగ్ లైబ్రరీ ట్రస్ట్ చైర్మన్ శంకరయ్య పేర్కొన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా నంద్యాలలోని స్థానిక లైబ్రరీ ఎదుట ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ట్రస్ట్ బోర్డు సభ్యులు మాదాల శ్రీనివాసులు పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి పాలక వర్గ విధానాల కారణంగా దేశంలో అవినీతి, ఆశ్రీత పక్షపాతం, నిరుద్యోగం, మతోన్మాదం పెరిగి పోతున్నాయని వీటిని వ్యతిరేకస్తూ భగత్ సింగ్ స్ఫూర్తిగా యువత ఉద్యమల్లోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో అరసం జిల్లా అధ్యక్షులు మూర్తుజా, నాయకులు మద్దిలేటి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో.. ప్యాపిలి : ప్యాపిలి పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్ నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి శివ కేశవులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బంగారప్ప, ప్రసాదు, గిరి, తదితర విద్యార్థులు పాల్గొన్నారు. **బేతంచర్ల:** భగత్ సింగ్ ఆశయ సాధన కోసం సమిష్టిగా పోరాడతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వై ఉదయ్ అన్నారు. గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయం ఆవరణలో భగత్ సింగ్ 116వ జయంతిని నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు



భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నాటు బాంబుల కేసులో నిందితులు అరెస్ట్

నందికొట్కూరు రూరల్ సిఐ విజయభాస్కర్

ప్రజాశక్తి - నందికొట్కూరు

పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామంలో నాటు బాంబుల కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సిఐ విజయభాస్కర్ తెలిపారు. గురువారం నందికొట్కూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి సిఐ మాట్లాడారు. 'జులై 24న ఆశన్న మధు (అల్లరి మధు), మద్దిలేటి అనే వ్యక్తులు ఇద్దరిపై ముద్దాయిలు పాత మనస్పర్థలు ఉన్నాయని, అల్లరి మధుకు పెద్ద రంగడు, పెద్ద రంగస్వామి, చిన్న రంగస్వామికి మధ్య గోడ, చెట్టు కొట్టిన విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. అల్లరి మధును మద్యం కేసులో ఇరికించాలని ఒక పిటిషన్‌ను తయారు చేసి ఉన్నత అధికారులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడుకు ఉన్న పాత మనస్పర్తల కారణంగా అందరూ గ్రూప్‌గా ఏర్పడి ఫిర్యాదు దారుడిని, మద్దిలేటిని ఎలాగైనా కేసులో ఇరికించాలని ముద్దాయిలు అందరితో పాటు బొల్లవరం స్వాములు, దబ్బల వెంకట స్వామిలతో కలిసి అల్లరి మధు, మద్దిలేటిలపై నాటు బాంబుల కేసు పెట్టాలని కుట్రపన్నారు. విచారణలో ముద్దాయిలు ఒప్పుకున్నారు' అని సిఐ తెలిపారు. 'దబ్బల వెంకట స్వామి, బోయ చిన్న దంతాలు ద్వారా 31 నాటు బాంబులను రూ.20 వేలకు తయారు చేయించారు. ఆ డబ్బులు పెద్ద రంగస్వామి అతని తమ్ముడు చిన్న రంగస్వామిలు ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. తరువాత వారం రోజులకు దంతాలు, దబ్బల వెంకట స్వామిలు 31 బాంబులు తయారు చేసుకొని వచ్చి ఆర్ఎంపి డాక్టర్ కరీం, తన చేతితో అల్లరి మధు, మద్దిలేటిల పేర్లు, ఫోన్ నెంబర్లు, చీటిలు రాసి వారు కొనుగోలు చేసినట్లుగా డబ్బులు కూడా రాసి కవర్లలో పెట్టారు. అలాగే పెద్ద రంగస్వామి పెద్ద రంగడు, చిన్న రంగస్వామిలకు ఇవ్వగా వారు 22 బాంబులను అల్లరి మధు ఇంటి బాత్ రూముపై గల నీళ్ళ ట్యాంకులో ఉంచారు. కొన్ని రోజులకు మధు ట్యాంక్‌లో ఉన్న నీటితో పిల్లలకు స్నానం చేయిస్తుండగా దద్దుర్లు రావడంతో ట్యాంక్ శుభ్రం చేసేందుకు వెళ్లగా ట్యాన్క్‌లో నాటు బాంబుల మూటే కనిపించింది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి ఏ .శ్రీనివాసరావు పర్యవేక్షణలో పూర్తి విచారణ చేసి కేసులో ముద్దాయిలను అరెస్ట్ చేశాం' అని తెలిపారు. 7 మంది ముద్దాయిలు నందికొట్కూరు నుండి కర్నూల్ పోవు మెయిన్ రోడ్ పక్కన అరబిక్ మదరసా సమీపంలో ఉండగా సిబ్బందితో కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కేసులో పరారీలో ఉన్న ఇద్దరు ముద్దాయిలు దబ్బల వెంకట స్వామి, బొల్లవరం స్వాములును త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. గ్రామాల్లో పాత కక్షలు పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ

జిపిఎస్ బిల్లు పత్రాలకు నిప్పు

ప్రజాశక్తి - ప్యాపిలి

జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ యస్‌టియు పిలుపుమేరకు గురువారం స్థానిక ప్యాపిలి ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో జిపిఎస్ బిల్లు పత్రాల నకలును దహనం చేశారు. ఈ సందర్భంగా యస్‌టియు నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఆజాం బేగ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, జిల్లా సిపిఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి, ఎస్టీయు మండల అధ్యక్షులు చంద్ర మౌళి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాని జిపిఎస్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టియు నాయకులు అజాం బేగ్, వెంకట్ నాయక్,నాగరాజు, చంద్ర మౌళి, చిన్నప రెడ్డి, మౌలాలి, సురేశ్ బాబు, శ్రీనివాసులు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జిపిఎస్ బిల్లు నకలు పత్రాలను తగలబడుతున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు చైర్మన్ డాక్టర్ ఆసియా

వ్యక్తిగత దూషణలు మానుకోవాలి : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రతిపక్షాల నాయకులు తమ ఎమ్మెల్యేపై, యువ నాయకుడు కార్తీక్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, వైసిపి మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 15 రోజుల నుండి ఆత్మకూరులో టిడిపి నాయకులు దీక్షలు చేస్తూ తమ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే శిల్పాపై అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. వ్యక్తిగత దూషణలు మానుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ రోజు ఒక జడ్జిని మహిళ అని చూడకుండా వ్యక్తిగత దూషణలకు దిగారని, మీరు విలువల గురించి మాట్లాడం విచిత్రంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఆత్మకూరు పట్టణ, మండల ప్రెసిడెంట్లు సయ్యద్ మీర్, రాజమోహన్ రెడ్డి, జెడ్పిటిసి శివశంకర్ రెడ్డి, లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నగేష్, పార్టీ సెక్రటరీ తిమోతి, జెసిఎస్ కన్వీనర్లు సుల్తాన్, లక్ష్మిరెడ్డి, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి, సింగల్ విండో చైర్మన్ సురేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1న గ్రామాల్లో శ్రమదానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 1వ తేదీన నిర్వహించే 'ఏక్ తారిఖ్ - ఏక్ మంటా - ఏక్ సాథ్ - స్వచ్ఛరా కె లియే" శ్రమదాన కార్యక్రమమును ప్రతీ గ్రామములోని ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆయా గ్రామ పంచాయతీ ఆ పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రామాలు చుట్టలాని జిల్లా పంచాయితీ అధికారి మంజులవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ముఖ ద్వారాలు, మార్కెట్ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రార్థనా మందిరాలు తదితర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆమె సూచించారు. శ్రమదానం కార్యక్రమాల్లో చెత్తచెదారాలను సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీ పెడ్లకు తరలించేందుకు వీలుగా పొరకలు, ట్రై సైకిల్స్, ఇతర పారిశుధ్య పని ముట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. సదరు శ్రమదాన కార్యక్రమాల ఫోటోలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ముందుగానే తెలిపిన వెబ్సైటు (సిటిజన్ ఆప్) లో పొందుపరచవలసినదిగా ఆదేశాలు జారీ చేయబడినవని జిల్లా లోని అందరు విస్తరణ అధికారులు, ఎంపీడీఓలు, డిఎల్‌పిఓలు కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

బిజెపి పాలనలో పెరిగిన నిరుద్యోగం

- అక్టోబర్ 22 నుండి సిపిఎం బస్సు జాతా
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - పాములపాడు

బిజెపి పాలనలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల కొలువుల మొత్తం 18 కోట్ల నిరుద్యోగం పెరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ప్రధాని ప్రతి సంవత్సరం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేసి, రిక్రూట్ అయిన పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా అమ్ముతుందని విమర్శించారు. రూ. 3 లక్షల 50 వేల కోట్లు విలువ చేసే విశాఖ ఉక్కును కేవలం రూ. 16 కోట్లకు అమ్మేందుకు పూనుకున్నారని తెలిపారు. మరోవైపు ఆర్టిఫిషియల్ టెక్నాలజీ పేరుతో దేశంలోకి రోబోలు రాబోతున్నాయని, వీటి ద్వారా పెట్టుబడిదారులు కార్మికులను తీసివేసే పరిస్థితి ఉందన్నారు. నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షం సిద్ధమవుతున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం జమిలి పాట పాడుతుందన్నారు. బిజెపి ఎన్నికల ముందు మళ్లీ అధికారం ఎక్కేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. దేశంలో దళితుల పై, మైనార్టీలపై దాడులు పెరిగాయని తెలిపారు. నంద్యాల జిల్లాలో గ్రీన్ కో కంపెనీకి 30 వేల ఎకరాల ను కారు చౌకగా అమ్మేశారన్నారు. బిజెపికి వ్యతిరేకంగా రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు నోరు విప్పడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధా నాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి అక్టోబర్ 22 నుండి రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయ నగరం, కర్నూల్ నుండి బస్సు జాతా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ జాతా నవంబర్ 4 నాటికి విజయ వాడ చేరుకుంటదని, 15న పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు కార్మికులు, కర్షకులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వర రావు, బాలయ్య, బాల యేసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మహానంది

మండలంలో పంటలను నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు డిమాండ్ చేశారు. గురువారం బసాపురం గ్రామంలో మునగ, మినుము పంట పొలాలు అడవి పందుల దాడి తీవ్రంగా నష్టపోయిన భూములను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్య ఆక్కడి నుండి ఫోన్ ద్వారా హార్టికల్చర్ ఆఫీసర్ ఎల్లమ్మకు, స్థానిక వ్యవసాయ అధికారి ఇంద్రాణికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అధికారులు వెంటనే పంట నష్టపోయిన భూములను పరిశీలించి, పంట నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అందుకు సంబంధించిన వ్యవసాయ అధికారులు రేపు పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలిస్తామని చెప్పారు.

సంక్షోభాలు కొత్తకాదు.. ఎదుర్కొంటాం : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


తెలుగుదేశం పార్టీకి సంక్షోభాలు కొత్తకాదని అనేక సందర్భాల్లో ఎదురైనా సంక్షోభాలను తట్టుకొని పార్టీని నిలబెట్టిన నాయకుడు చంద్ర బాబు నాయుడని సంక్షోభాలను ఎదుర్కొంటామని టిడిపి నంద్యాల పార్ల మెంట్ నియోజకవర్గం ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నంద్యాలలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. గురువారం జరిగిన దీక్షల్లో నంద్యాల, గోస్పాడు మండల నాయకులు కూర్చున్నారు. ఈ దీక్షలను నంద్యాల మాజీ శాసనసభ్యులు భూమా బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించారు. ఈ దీక్షలకు మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎండి ఫరూక్, టిడిపి నంద్యాల పార్లమెంటు ఇంఛార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని ఎవ్వరు అధైర్య పడవద్దని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

బనగానపల్లె: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తు న్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయ సమీపంలో 'బాబు తో నేను బాబు గారికి తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం అంటూ టిడిపి మద్దతుదారుల సర్పంచులు, వార్డ్ మెంబర్లు రిలే నిరాహారదీక్షలు నిర్వ హించారు. దీక్షలో పాల్గొన్న సర్పంచులు, వార్డు మెంబర్లకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడు తూ వైసిపి ఎన్ని కుట్రలు కుతంత్రాలు పడిన వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, రామకృష్ణాపురం శంకర్ వేములపాడు గుర్రప్ప,లాయర్ నాగేంద్ర రెడ్డి, అల్తాఫ్ హుస్సేన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల కలెక్టరేట్ : మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

చాగలమర్రి : అరాచక పాలన సాగిస్తున్న వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష అన్నారు. 'నేను సైతం బాబు కోసం'లో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ పట్టణంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో ఎంఎస్ అన్సర్ బాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి షరీఫ్, చల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, రఫీద్దీన్ రియాజ్, ఆలంశగారి మౌలాలి, హనీఫ్, పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి ముల్లా అజీమ్, సోను షబ్బీర్, అష్రాఫ్, షాదాబ్ అర్షద్, మహమ్మద్, షంషీర్ బషీర్, నాగూర్ గాంధీ, జోసెఫ్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.


చాగలమర్రి : ఆళ్లగడ్డలో భూమా నివాసం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన టిడిపి నాయకులు


రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే బిసి, టిడిపి నాయకులు

ఆత్మకూర్ : చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులను ఎత్తివేసేంతవరకు దీక్షా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆత్మకూరు సీనియర్ న్యాయవాది కే గోవింద్ రెడ్డి అన్నారు. ఆత్మకూరులో 16వ రోజు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులను కొట్టు వేసే విధంగా న్యాయస్థానంలో పోరాడుతూనే ప్రజల మధ్య ఈ దీక్షా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి నజీర్ అహ్మద్, నర్ల రాఘవ రెడ్డి, బాల నరసింహులు, బి.అన్వర్, వై శ్రీనివాసులు, మదన్ భూపాల్, ఆరిఫ్, రమణా రెడ్డి, నాగార్జున గౌడ్, కే.శివా రెడ్డి, శ్రీనివాసులు, అమ్ముల్లా లతో పాటు పలువురు రిలే దీక్ష చేపట్టారు. సీనియర్ నాయకులు వంగాల శివరామిరెడ్డి, కంచర్ల గోవింద రెడ్డి, గిరి రాజు, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా పురం బాషా, రాజా రెడ్డి, రమేష్ గౌడ్, నాగుర్ ఖాన్, రాముర్థి, శివా రెడ్డి, శ్రీనివాసులు, రఘు స్వా మి రెడ్డి, సతీష్, మున్నా, వలి ఖాన్, శ్రీకాంత్ తదితరులు మద్దతు తెలిపారు.

నందికొట్కూరులో.. 16వ రోజు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రిలే దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి మాట్లా డుతూ వైసిపి నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని అన్నారు. కొత్తపల్లి మండల అధ్యక్షులు జడ్డు వెంకటరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లింగస్వామి గౌడ్, మండల నాయకులు నారపరెడ్డి, బుచ్చిరెడ్డి, అభిబుల్ల ఖాద్రి, శివారెడ్డి, మోహన్, మాసుమయ్య, రమణారెడ్డి, మాడుగుల లింగన్న, శేఖర్, వెంకటస్వామి పాల్గొన్నారు.


ఉపాధ్యాకులను సన్మానం చేస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -ప్యాపిలి

ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు ఎస్టియు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎస్టీయు ప్యాపిలి మండల శాఖ ఆధ్వర్యంలో చంద్రమౌళి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు పొందిన డోన్ ఎన్.ఎన్. కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబుకు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన శ్రీనివాసులు పి.ఆర్.పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడికి శాలువా, జ్ఞాపిక పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్టీయు నంద్యాల జిల్లా అధ్యక్షులు అజాం బేగ్,ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజులు నంద్యాల జిల్లా సి. పీ.యస్ కన్వీనర్ చిన్నప రెడ్డి, సీనియర్ నాయకులు మౌలాలి మాట్లా డుతూ ఎస్టియు సభ్యులు ఎల్లప్పుడూ వృత్తికి న్యాయం చేస్తూ అంకిత భావంతో పనిచేస్తారని అన్నారు. అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిం దని అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు అజామ్ బేగ్ వెంకట్ నాయక్, నాగరాజు, చంద్రమౌళి, చిన్నపరెడ్డి,రాంప్రసాద్, వెంకటేశ్వ ర్లు, శేఖర్, రామాంజనే యులు, మధుసూధన్, మద్దిలేటి, నందప్ప, నాగన్న,నాగేశ్వర నాయక్, పుల్లయ్య, నాగ మల్లేష్, మనోహర్,శివ, శేష నాయక్, విజయ్ కుమార్ రెడ్డి, మల్లేష్, సుశీల, జీవిత, ప్రియాంక, పీ.అర్. పల్లి గ్రామ పెద్దలు మర్రెడ్డి,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాషువా ప్రతి అక్షరం సామాజిక చైతన్యం కోసం


(5వ పేజీ తరువాయి...) తెలుగు పండితురాలు జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించబడిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరికి పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త అయిన బి శంకరయ్య తమ సందేశంలో ఇటువంటి ఉపయుక్తమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న నంద్యాల అరసం జిల్లా శాఖను ప్రత్యేకంగా అభినందించారు. నంద్యాల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన అరసం జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడు పివి రామకృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. తర్వాత మద్దిలేటి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఆళ్లగడ్డ: పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి వేడుకలు అపుస్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ బాష, ప్రిన్సిపాల్ వెంకటరాముడు తదితరులు భగత్ సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించి వారి గొప్పతనాన్ని విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ, అరుణోదయ స్కూల్ హెచ్ఎం ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : దేశ స్వాతంత్ర సమరయోధులు, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తల సేవలు చిరస్మరణీయమని బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ వి సాగరిక, డోన్ సామాజిక కార్యకర్త పి మహమ్మద్ రఫీ అన్నారు. గురువారం స్థానిక బేతంచెర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నందు పిసిపిఎన్ డిటి (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కుక్క కాటుకు వ్యాక్సిన్ కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ ఈ.పాస్టర్ వర్ధంతిని పురస్కరించుకొని, విప్లవ కెరటం సాహిద్ భగత్ సింగ్ జయంతి, మహాకవి గుర్రం జాషువా జయంతిలను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైద్యులు చరణ్ రాజ్, సంగీత, స్టాఫ్ నర్స్ కవిత, ఎం రాజేశ్వరి, ఉషా రాణి, పురుషోత్తం రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల గాయకుడు నరసింహులు ను సత్కరిస్తున్న దృశ్యం


ఆళ్లగడ్డ: మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ..

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రైతులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు యస్ఐ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున రాత్రి సమయాల్లో ప్రమాధాలా నివారణలో భాగంగా ప్రతి రోజు తెల్లవారుజామున 02.00 నుండి 04.00 గంటల వరకు జమ్మలమడుగు జంక్షన్ వద్ద స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో నిద్రమత్తులో ఉన్న వివిధ వాహనాలను ఆపి ఆయ డ్రైవర్లను మంచినీటితో మెహం కడుక్కునేలా చెయ్యడం, రాత్రి సమయాల్లో యాక్సిడెంట్స్ జరక్కుండా ఉండేలా తగిన సూచనలు ఇచ్చి పంపడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

O.S. NO.633/2022

ది కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ నంద్యాల
రిప్రెజెంటెడ్ బై సీనియర్ బ్రాంచ్ మేనేజర్. ...వాది

వర్సెస్

1.మేడా గురువయ్య వయసు 38 సం॥, తండ్రి మేడ సీత రామ సుబ్బయ్య, వ్యవసాయం H.No.17-185 పార్క్ రోడ్, నంద్యాల టౌన్ నంద్యాల జిల్లా.
2.పి.మహేష్ కుమార్ తండ్రి ఆదినారాయణ 38 సం॥, వ్యవసాయం, H. No.19-130, మేడం వారి వీధి, నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా. ..ప్రతివాదులు

ప్రతివాదులు కి దావా సమన్సు

వాది, ప్రతివాదులైన మీ నుండి ప్రామిసర్ **నోటుకు**2,72,968-00 రాగోరి పై దావా దాఖలు చేసినాడు. ప్రతివాదులైన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నను స్వయంగా గాని, వకీలు ద్వారా గాని, పై కోర్టులో 13-10-2023 తేదీన ఉదయం. 10.30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది.13-10-2023

ఇట్లు
తాళంకి వెంకట ప్రసాద్
బి.కాం.బి.ఎల్.
అడ్వకేట్. సంజీవ నగర్,
నంద్యాల.
సెల్ నెం.9866367559

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: నంద్యాల.

EP. No.115/2022 in OS. No.4/2016

యేల్లంపల్లి రామిరెడ్డి
తండ్రి లేట్ యేల్లంపల్లి గోపాల్ రెడ్డి
బలపనూరు గ్రామం, పాణ్యం మండలం,
నంద్యాల జిల్లా. ...డి.హెచ్.ఆర్

వర్సెస్

యేల్లంపల్లి రామ్మోహన్ రెడ్డి
తండ్రి లేట్ యేల్లంపల్లి చిన్నపు రెడ్డి,
బలపనూరు గ్రామం, పాణ్యం మండలం,
నంద్యాల జిల్లా. ...జె.డి.ఆర్

జె. డి. ఆర్ కు నోటీస్ ఆర్డర్ 21 రూల్ 66 సి.పి.సి ప్రకటన

పై నెంబరు అర్జీ నందు డి.హెచ్.ఆర్ గారు డిక్రీ మొత్తాన్ని రాబట్టు కొనుటకు గాను జె. డి.ఆర్ అయినా నీ తాలూకు E P షెడ్యూల్ దాఖల ఆస్తిని జప్తు మరియు వేలం కోరి అమలు అర్జీ దాఖలు చేసి ఉన్నాడు. సదరు అర్జీలో జె.డి.ఆర్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నాయెడల పై కోర్టు వారి ఎదుట 16-10- 2023వ తేదీ ఉదయం 10:30కు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతట కోర్టు వారు మీ పరోక్ష మందు పై అర్జీని తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది 16-10-2023

టీ.ఆర్. రాఘవరెడ్డి,
డి. హెచ్.ఆర్.పరం అడ్వకేట్,
నంద్యాల.

మహారాజశ్రీ రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: నంద్యాల

I.A. NO.67/2023 IN IP NO.22/2020

కాటం పద్మ. ...పిటీషనర్

వర్సెస్

1. గోపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి
2. పోతిరెడ్డి విజయ
W/O. పి వెంకట సురేష్ రెడ్డి. ...రెస్పాండెంట్స్

R1.
గోపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తండ్రి జి.శివ నాగిరెడ్డి
ఇంటి నెం. 28-851-R4-1 విస్వనగర్,
నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా.

మొదటి రెస్పాండెంట్ కు నోటీస్

పైన తెలిపిన పిటీషనర్ మొదటి రెస్పాండెంట్ ను దివాలాదారులుగా ప్రకటించి సదరు మొదటి రెస్పాండెంట్ రెండవ రెస్పాండెంట్ కు వ్రాయించి ఇచ్చిన రిజిస్టర్ విక్రయ దస్తావేజు రద్దు చేసి మరియు అఫీషియల్ రిసీవర్ కు సదరు ఆస్తిని అప్పజెప్ప వలసినదిగా ఒక అర్జీని పై కోర్టులో పైన తెలిపిన రెస్పాండెంట్ పైన దాఖలు చేసి ఉన్నారు. సదరు అర్జీలో మొదటి రెస్పాండెంట్ అయిన నీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా నోటీసులు ముట్టనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు 13- 10- 2023వ తేదీన ఉదయం 10:30 గం. మీరు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లా లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 13 -10- 2023

ఇట్లు
N. శ్రీనివాసులు బాబు,
అర్జీదారు పరం అడ్వకేట్,
నంద్యాల.


మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్

హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

హమాలీ కార్మికులకు పని భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్‌లు అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏర్పాటు చేసిన హమాలీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా హమాలీ కార్మికులుగా పనిచేస్తున్న హమాలిలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటుచేసిన వెల్ఫేర్ బోర్డు మాదిరిగా హమాలీ కార్మికులకు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు యజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించి వైద్య సేవలు అందించాలని, మరణించిన వారికి రూ 10. లక్షలు, సాధారణంగా మరణించిన వారికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. పని భారం పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు రఫిక్, హుషన్ భాష, రైట్ భాష, మౌలాలి, మియాసా, చౌదరి, అస్లాం, దస్తగిరి, శేషయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేలం పొలంపై ఆక్షేపణలు చేయరాదు

- మోసగించిన వ్యాపారి ఆస్తుల వేలం ద్వారా రైతులకు న్యాయం
- రైతు సంఘం నాయకులు బెస్తరాజు

ప్రజాశక్తి - నందికొట్కూరు

కొణిదెల గ్రామానికి చెందిన వ్యాపారి లక్ష్మీనారాయణ వివిధ రకాల ధాన్యాన్ని ముచ్చుమర్రి, నెహ్రూ నగర్, కొణిదెల, నాగటూరు గ్రామాలకు చెందిన రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసి సొమ్ము ఎగవేత చేసిన ఘటన అందరికి తెలిసిందేనని, ఆయన పొలాన్ని వేలం వేసి వచ్చిన డబ్బు ద్వారా బాధితులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు బెస్తరాజు పేర్కొన్నారు. వేలంలో కొనుగోలు చేసిన పొలంపై ఎవరూ ఆక్షేపణలు చేయరాదని తెలిపారు. గురువారం మండలంలోని కొణిదెల గ్రామంలో వ్యాపారి లక్ష్మీనారాయణ భూమి కొనుగోలుపై చెల్లించాల్సిన మిగులు సొమ్ముపై గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో గ్రామ పెద్ద మనుషులతో కలిసి వ్యాపారి ఆస్తులను ప్రజల సమక్షంలో వేలం వేశామన్నారు. వేలం ద్వారా వచ్చిన రూ. 43 లక్షల 7 వేలను లక్షకు ఆరు వేల చొప్పున బాధిత రైతులకు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో అందజేశామన్నారు. లక్ష్మీనారాయణ ఆస్తుల వేల విషయంలో గ్రామ పరిధిలోని సర్వే 343/1లో 6 ఎకరాల 18 సెంట్లను గ్రామానికి చెందిన బెస్త మల్లేశ్వరి, గోవుల లక్ష్మీదేవిలు రూ. 19 లక్షల 35 వేలకు పాట పాడి దక్కించుకున్నారని చెప్పారు. వేలంపాటలో భూమి దక్కించుకున్న రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. గ్రామ ఐక్యతకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

వార్డులలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించడమే మున్సిపాలిటీ ధ్యేయమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని 3 వార్డు నందు గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమం ద్వారా వచ్చిన పదిలక్షల రూపాయలతో అలాగే స్పెషల్ గ్రాంట్స్ కింద 20 లక్షల రూపాయలు వచ్చిన నిధులతో చేపడుతున్న టువంటి రోడ్లు,కల్వట్లు, కాలువల పనులను మున్సిపల్ చైర్మన్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల అభివృద్ధిని చేయ డమే తమ ప్రాధాన్యతని అన్నారు. ప్రతి వార్డులో మౌలిక వసతులు ఒక్కొక్కటిగా కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,ఏఈ సురేష్,మూడవ వార్డు కౌన్సిలర్ పూజారి వెంకటేశ్వ రమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, వైసిపి నాయకులు వంశీకృష్ణ, మేకలహరి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్


కార్మికులకు వస్తువులు అందజేస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో గురువారం కమిషనర్ రమేష్ బాబు, మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణకు ఉపయోగించే బకెట్లు, సబ్బులు, కొబ్బరినూనె, గ్లౌజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని వార్డులలో పరిశుభ్రత లోపించకుండా తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునికి ఉందని, ఆయా వార్డుల కౌన్సిలర్లకు బాధ్యతతో పాటు కమాండి ంగ్ ఇవ్వడం ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. ఇండ్లలోని చెత్తను ప్రజలు రోడ్లపై పడవేస్తున్నారని అలా కాకుండా చెత్త ఇంట్లో డబ్బాలో కానీ, బయట పారిశుద్ధ్య కార్మికుని చెత్త డబ్బాలో కానీ ఉండే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఆళ్లగడ్డ మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలంటే ప్రజలతోపాటు మున్సిపల్ కార్మికుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పరంగా కార్మికులకు వారు ఆరోగ్యకరంగా ఉండేందుకు మెడికల్ కిట్లను రెండో విడతగా అందజేస్తామన్నారు. త్వరలో మున్సిపల్ కార్మికుల యూనిఫామ్ కూడా అందజేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డులలో చెత్తను సేకరించేందుకు 400 పెద్ద టబ్బులను అందజేయడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సునీత, సచివాలయ అధికారి బాలస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడిగా జి.రవీంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు



పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన జి రవీంద్రనాథ్ రెడ్డిని టిడిపి మండల అధ్యక్షునిగా రాష్ట్ర అధ్యక్షులు అచ్చె నాయుడు ఆదేశాల మేరకు నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ తెలిపారు. గురువారం పాములపాడు మండలంలోని టిడిపి నాయకులు రవీంద్రనాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి నాయకులను, కార్యకర్తలను కలుపుకొని అందరి సహకారంతో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన మాండ్ర శివానందరెడ్డికి, గౌరు వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వర్గీకరణ జరిగే ప్రసక్తే లేదు : మాలమహానాడు

ప్రజాశక్తి - ఆత్మకురు



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మునయ్య

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరిగే ప్రసక్తే లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మున్నయ్య అన్నారు. గురు వారం పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మా లల ఆత్మీయ సమ్మేళనం నాయకులు ముర హరి మల్లయ్య, శీలం శేషు, ఏ మ్ముని శివ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునయ్య, జిల్లా అధ్యక్షులు దామ రేకుల రాజు, డాక్టర్ ఎర్రన్న, వెలుగోడు సర్పంచి జయపాల్‌లు హాజరయ్యారు.

ముందుగా అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు .అనంతరం నాయకులు మాట్లాడు తూ కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టి, రెండు వర్గాలుగా విభజించి, వర్గీకరణ చేయాలని అనేక ప్రయత్నాలు చేశారన్నారు. వారి ప్రయత్నాలు నెర వేరలేదని తెలిపారు. ఇప్పటికీ వర్గీకరణ పేరుతో దళితులను ఓటు హక్కు కోసం వినియో గించుకుంటున్నారని చెప్పారు. వర్గీకరణ జరగదని సుప్రీంకోర్టు క్లీన్ చీట్ ఇచ్చినప్పటికీ ఇంకా వర్గీకరణ జరగాలంటూ, అసెంబ్లీలో, పార్లమెంటులో బిల్లు పెట్టాలంటూ, దళితులను మభ్య పెడుతున్నారని తెలిపారు. దళితులంతా ఐక్యత కలిగి ఉంటే అధికారం తమ చేతులకే వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకురాలు చెన్నమ్మ, కరివేన సర్పంచి జయన్న, గుమ్మడాపురం సర్పంచ్ విజయ్ కుమార్, గోకవరం సర్పంచ్ మారెన్న, వేంపెంట సర్పంచ్ దానమయ్య, ఎస్సీ ఎస్టీ మానిట రింగ్ సభ్యులు దిలీప్, మాల మహానాడు మహిళా నాయకులు సుబ్బమ్మ, దరగమ్మ, పరిమళమ్మ, నందికొట్కూరు, ఆయా మండలాల ప్రముఖ నాయకులు, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు, ఆత్మకూరు నాయకులు పాల్గొన్నారు.

డివైడర్‌ను బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ప్యాపిలి

బైక్ రోడ్డు డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. డోన్ మండలం పెద్ద మల్కాపురం గ్రామ నివాసి సున్నం వెంకటేష్ (40) గురువారం నాడు ధర్మవరంలో పాలిష్ కట్టర్‌గా పనిచేసి స్వగ్రామం పెద్ద మల్కాపురంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా పోదొడ్డి గ్రామం వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం రిపోర్ట్ నిమిత్తం డోన్‌కి తరలించారు.

చోరీకి వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సంజామల

చోరికి వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన సంజామల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సంజామల వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద కాపర్ వైర్‌ను దొంగలించడానికి నాగేంద్ర (30) ప్రయత్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై ప్రతాప్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్వామినాథన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - నంద్యాల

హరిత విప్లవ పితామహుడు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్.ఎస్. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని విశ్రాంత అంతర్జాతీయ శాస్త్రవేత్త నంది రైతు సమాఖ్య గౌరవ సలహాదారులు డా. కాదర బాద్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం స్వామినాథన్ మృతి సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ కృషి చేశారని అన్నారు. నేటి శాస్త్రవేత్తలు ఆయన మార్గంలో పయనించి దేశాభివృద్ధి కృషి చేయాలన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో నంది రైతు సమాఖ్య అధ్యక్షులు ఉమా మహేశ్వ రారెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త నాగరాజారావు తదితరులు ఉన్నారు.

30న చలో విజయవాడ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-డోన్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 30న తలపెట్టిన 'హలో విద్యార్థి చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ డోన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్ బాషా, జె.అశోక్‌లు కోరారు. గురువారం డోన్ పట్టణంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 21 నుంచి ఈనెల 1వ తేదీ వరకు జిల్లాలోని 29 మండలాలు తిరిగి విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని అన్నారు. కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు, మహిళా డిగ్రీ కళాశాల, మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంపు, జాబ్ క్యాలెండర్ తదితర సమస్యలు పరిష్కరించాలని హలో విద్యార్థి చలో విజయవాడకు పిలుపునివ్వడం జరిగిందని, భారీగా విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వేణుమాధవ్, శ్రీనివాసులు, ఆకాష్, గిద్దయ్య, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.